సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

త్వరలో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు



ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధం చేసిన సామగ్రి

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలో కొత్త ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సామగ్రి సిద్ధం చేశారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు సంబంధించి ఇది ప్రధాన ఆస్పత్రిగా ఉండగా సరైన ఎక్స్‌రే సదుపాయం లేదు. తాత్కాలికంగా ఏర్పాటు చేసినా అది సరిగ్గా పని చేయడం లేదు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం కొత్త ఎక్స్‌రే ప్లాంట్‌కు సామగ్రి పంపడంతో కొద్ది రోజుల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడకు ఎక్స్‌రేలు అవసరమై వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలూ తీసుకునే అవకాశం వుంది.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి ఎగువపేట మత్స్యకారుల ఆరాధ్యదైవం శ్రీపోలమాంబ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా మంగళవారం వుడా మైదానంలో క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. వీటిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు జరగాలన్నారు. గెలుపు, ఓటములను చూడకుండా అందరూ క్రీడాస్ఫూర్తితో ఆడాలని సచించారు. కార్యక్రమంలో ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలోని మామిడి తోటలో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి, రూ.1,98,260 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. ముందుగా అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్సు పోలీసులతో కలిసి శిబిరంపై దాడి చేసినట్టు తెలిపారు.

పీఎం పాలెం : మిథిలాపురి వుడా కాలనీలోని ఓ విల్లాలో పేకాట ఆడుతున్న ఆరుగురిని మంగళవారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశామని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపారు. వారి నుంచి లక్షా 15 వందల రూపాయలు, 5 ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



తగరపువలస: తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం క్యాంపస్ పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 19 బాలబాలికల పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో విశాఖ జిల్లా బాలుర జట్టు మొదటి స్థానంలో, బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచింది. బాలుర జట్టులో తగరపువలస శ్రీబాసర జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.వివేక్ వర్ధన్ ఉన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వివేక్ వర్ధన్‌ను శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, డిఫెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి అభినందించారు.

అక్షయపాత్ర వంటశాల పరిశీలన

ఆనందపురం : నగరంలోని సీపీయూ కళాశాల విద్యార్థులు మంగళవారం మండలంలోని గంభీరంలో ఉన్న అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాలను సందర్శించారు. సుమారు వంద మంది విద్యార్థులు వంటశాలలో ముడి సరుకు స్వీకరించు పద్ధతి, ల్యాబ్‌లో ఆహార పదార్థాల తయారీ, కూరగాయలను శుభ్రం చేయడం, ఆవిరి ద్వారా వంట చేయడం వంటి అంశాలను పరిశీలించారు. వంటశాల నాణ్యత విభాగం ఇన్‌చార్జి హరీష్, శ్యామమాధవ దాస స్వామీజీ వివరాలు వెల్లడించారు.

ఇనాం భూముల రైతులకూ 'రైతు భరోసా'



కార్యక్రమానికి హాజరైన రైతులు



రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- సెటిల్‌మెంట్ పట్టాలిచ్చాక సాయం
- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలోని బోని, శిర్లపాలెం, ముచ్చర్ల, నారాయణరాజుపేట, కృష్ణాపురం గ్రామాల్లోని ఇనాం భూములు సర్వే చేశామని జేసీ విశ్వనాథన్ అన్నారు. సంబంధిత రైతులకు త్వరలోనే సెటిల్‌మెంట్ పట్టాలు పూర్తి హక్కులతో అందించి రైతు భరోసా సాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని బోని గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వీర్యమైపోయిన వ్యవసాయ రంగాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో కళ్లారా చూసి పథకాలకు రూపకల్పన చేశారన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక, పెట్టుబడులు పెట్టే స్థోమత లేక అప్పుల పాలవడాన్ని చూసి రైతు భరోసా, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీకే పంట రుణాలు, వైఎస్సార్ యంత్ర సేవా పథకం వంటి పథకాలను అమలుపరుస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాలు ద్వారా కల్తీలేని విత్తనాలు, ఎరువులు అందించడంతోపాటు పంటలను గిట్టుబాటు ధరలకే కొనుగోలు చేసి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అనంతరం రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.17.50 లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. వాటి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోని అప్పలకొండ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, నాయకులు పాండ్రంకి అప్పారావు, కోరాడ లక్ష్మణ, బీఆర్‌బీ నాయుడు, బోని సన్యాసినాయుడు, లెంక రాంబాబు, షిణగం అప్పలరాజు, కర్రి నాయుడుబాబు పాల్గొన్నారు.



రైతు మద్దిల తాతినాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, జేసీ విశ్వనాథన్

రోడ్ల పక్కన బడ్డీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: ప్రధాన రహదారి వెంబడి అనధికారికంగా బడ్డీలు, కంటైనర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జోన్ – 2 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి హెచ్చరించారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ ప్రధాన రహదారుల వెంట అనధికారికంగా బడ్డీలు, కంటైనర్లు ఏర్పాటు చేయడంపై 'రాత్రికి రాత్రే బడ్డీల ఏర్పాటు' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురించిన వార్తకు ఆమె స్పందించారు. మంగళవారం అధికారులతో బడ్డీలను తొలగించారు. ప్రస్తుతం ఈ మార్గంలో రాకపోకలు అధికమవుతున్నాయని, ఈ క్రమంలో రోడ్డును ఆనుకుని బడ్డీలు ఏర్పాటు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.



రోడ్డు పక్కన కంటైనర్ బడ్డీ తొలగించిన తర్వాత దృశ్యం

దంత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం ప్రాథమిక పాఠశాలలో దంత ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. సంగివలస అనిల్ నీరుకొండ దంత కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో జాతీయ టూత్ బ్రషింగ్ వేడుకలు నిర్వహించారు. బ్రష్‌లు, పేస్ట్‌లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ప్రతాప్, వైద్యులు శివకుమార్, స్వాతి, అవినాష్ పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులతో దంత వైద్యులు

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు



పువ్వులు, తమలపాకుల అలంకరణలో కొత్తమ్మతల్లి

తగరపువలస: సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో పువ్వులు, తమలపాకులతో అలంకరించారు. నందిక వీరుబాబు, సన్యాసమ్మ ఆర్థిక సాయంతో భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అమ్మవారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. మల్లె, చామంతి, బంతి పూలదండలతోపాటు తులసి మాలలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రైళ్లలో బాణసంచా రవాణా నిషేధం

తాటిచెట్లపాలెం : దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌లో ప్రత్యేక డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టింది. రైళ్లలో దీపావళి సామగ్రి తరలించకూడదని, మండే స్వభావం గల పదార్థాలు తరిలించకూడదని విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగాలో రైళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రత్యేక స్క్వాడ్‌ను నియమించింది. డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లలో రైల్వే అధికారులు, సివిల్ డిఫెన్స్ సభ్యులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల బ్యాగులను, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు వీటిపై అనౌన్స్‌మెంట్స్ ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా రైళ్లలో, రైల్వేస్టేషన్‌లలో టపాసులు, మండే ప్రమాదకర పదార్థాలు రవాణా చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించారు.



విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

ప్రముఖ శాస్త్రవేత్త సీవీ రామన్‌కు నివాళి

తగరపువలస: ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త చంద్రశేఖర వెంకటరామన్ (సీవీ రామన్) జయంతి వేడుకలు మంగళవారం భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్ చిత్రపటానికి అధ్యాపకులు వి.సింహాద్రప్పడు, కె.సూరిబాబు, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు నివాళులర్పించారు. అనంతరం రామన్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. 1988లో తిరుచురాపల్లిలో జన్మించిన రామన్ 1950లో నోబెల్ బహుమతి, 1954లో భారతరత్న అందుకున్నారని తెలిపారు. బ్రిటీష్ రాయల్ సొసైటీ ఫెలోషిప్‌తో భౌతిక శాస్త్రంలో అనేక పరిశోధనలు చేశారని గుర్తు చేశారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

స్తంభాన్ని ఢీకొట్టి జీవీఎంసీ వాహనం బోల్తా



మారికవలస వద్ద వాహనం ఢీకొనడంతో ధ్వంసమైన విద్యుత్ స్తంభం



డంపింగ్ యార్డు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడిన జీవీఎంసీ వాహనం

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 మధురవాడలో వేర్వేరు చోట్ల 2 విద్యుత్ స్తంభాలను వాహనాలు ఢీకొట్టడంతో ధ్వంసమయ్యాయి. అయితే ఆ స్తంభాలు విద్యుత్ తీగల నుంచి విడిపోవడంతో పెను ప్రమాదాలే తప్పాయి. కొద్ది రోజుల వ్యవధిలోనే ఈ రెండు ఘటనలు జరిగాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి హైవే నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకి వెళ్లే రోడ్డు ఎల్ బెండ్ వద్ద జీవీఎంసీ జోన్ – 4కి చెందిన హుక్ లోడర్ అనే చెత్త తరలించే వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా కొట్టింది. అదృష్టవశాత్తు పెను ప్రమాదమే తప్పి అందులో ఉన్న డ్రైవర్ సహా మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొద్ది రోజుల క్రితం మారికవలస జాతీయ రహదారి వద్ద ఆర్‌జేకే జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ కొత్తకాలనీ – పాత కాలనీ మధ్య సిమెంట్ గొడౌన్‌ల వద్ద కూడా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి మరో విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. ఈ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ శాఖకు రూ.1.20 లక్షలు నష్టం వాటిల్లిందని ఏఈ సురేష్ చెప్పారు.

మహిళల వాలీబాల్ పోటీలు ప్రారంభం

మద్దిలపాలెం: ఏయూ ఇంటర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలు మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.విజయమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూ పరిధిలో 9 కళాశాలల నుంచి 100 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో తలపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి పల్లవి, వీఎస్ కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, కళాశాల పీడీ సంధ్యారాణి పాల్గొన్నారు.



వాలీబాల్ జట్లతో కృష్ణా కళాశాల అధ్యాపకులు

'సురక్ష' శిబిరాలతో ప్రజారోగ్యానికి భరోసా



వుడా కాలనీలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



50వ నంబరు సచివాలయంలో సత్కరించిన వైద్యులతో వైఎస్సార్ సీపీ నాయకులు



శిబిరంలో వైద్యులు, అధికారులు, నాయకులు

కొమ్మాది: ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టారని జోన్ – 2 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు వివేకానంద్ నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల వద్దకే స్పెషలిస్టు వైద్యులు వచ్చి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు.

అనంతరం ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు అప్పలరాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లో మంగళవారం మూడు చోట్ల జగనన్న సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో కార్పొరేటర్ లొడగల అప్పారావు శిబిరాన్ని ప్రారంభించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేస్తుందన్నారు. మిథిలాపురి వుడా కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.దీపికాదేవి ఆధ్వర్యంలో వైద్యులు తనూజ, శ్రీనివాస్, అరుణ, కవిత ప్రియదర్శిని సేవలు అందించారు.

జీవీఎంసీ 5వ వార్డు మారికవలస యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొమ్మాది జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ వైఎస్సార్ కాలనీ, గణేష్‌నగర్‌లో గల స్వతంత్ర నగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో వికలాంగుల కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వీటిని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేవారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు, వైద్య సేవలు అందించడంలో తండ్రిని మించిన తనయుడన్నారు. వికలాంగుల కాలనీలో వైద్య శిబిరాన్ని జెడ్సీ కనక మహాలక్ష్మి పరిశీలించారు.

802 మందికి వైద్య పరీక్షలు

పీఎం పాలెం : జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం 50వ నంబరు సచివాలయం ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులు 802 మందికి వైద్య సేవలు అందించారు. వారిలో 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని పీఎం పాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి సుజాన్ పల్లా తెలిపారు. అనంతరం వైద్యులను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గాదె రోసిరెడ్డి సత్కరించారు. వైఎస్సార్ సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పోతిన సూరిబాబు, జామి శివకుమార్ పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం



అమనాంలో స్వాధీనం చేసుకున్న బాణసంచా

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీలో అనుమతి లేకుండా నిల్వ చేసిన బాణసంచా సామగ్రితోపాటు ఇద్దరు వ్యక్తులను సిటీ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథరావు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సరకులో మందుగుండు తయారీకి వినియోగించే 18 కిలోల పౌడర్, 650 తారా జువ్వలు ఉన్నాయి. వీటితోపాటు ఇద్దరు వ్యక్తులను భీమిలి పోలీసులకు అప్పగించారు.

హెల్మెట్ తప్పనిసరి

కొమ్మాది: ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ మేరీ స్టెల్లా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటం, సిగ్నల్ రూల్స్ అతిక్రమించడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం ప్రాణాలను బలిగొంటాయన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని సూచించారు.

అవగాహనతో క్యాన్సర్ నివారణ

తగరపువలస: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రజల మరణాలకు కారణమవుతున్న ప్రాణాంతక వ్యాధుల్లో క్యాన్సర్‌ది రెండో స్థానమన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ మొట్టమొదటి జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని 2014లో ప్రకటించిందన్నారు. ప్రతి ఎనిమిది మంది మహిళల్లో ఒకరు గర్భాశయ క్యాన్సర్‌తో మరణిస్తున్నారన్నారు. పొగాకు నమలడం కూడా క్యాన్సర్‌కు దారి తీస్తుందని, 2018లో ఎక్కువ మరణాలు దీని వల్లే సంభవించాయన్నారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే క్యాన్సర్‌పై అవగాహన అవసరమన్నారు. ర్యాలీలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలో విద్యార్థులు

ముళ్ల పొదలతో ప్రయాణికులకు ఇబ్బందులు

పద్మనాభం: మండలంలోని ఏనుగులపాలెం సమీపాన బోని వాటర్ వర్క్స్ రోడ్డు మీదకు ముళ్ల పొదలు విస్తరించాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై పద్మనాభం, ఆనందపురం, విశాఖపట్నం వెళ్లే ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లారీలు తిరుగుతూ ఉంటాయి. కంచకు చెట్ల ముళ్ల పొదలు ఏనుగులపాలెం వద్ద రోడ్డు మీదకు వచ్చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. లారీల వంటి భారీ వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు వీటిని తప్పించేందుకు, పక్కకు వెళ్లేటప్పుడు ద్విచక్ర వాహన చోదకులు, ఆటోల్లో ప్రయాణించే వారికి ముళ్ల పొదలు తగులుకోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముళ్ల పొదల వల్ల కంటికి హాని కలిగే ప్రమాదం ఉండడంతో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఏనుగులపాలెం వద్ద రోడ్డుపైకి విస్తరించిన ముళ్లపొదలు

కేజీహెచ్‌లో సౌర వెలుగులు



సోలార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేజీహెచ్ అధికారులు

- రూ. 50 లక్షలతో 120 కేవీ ప్లాంట్ నిర్మాణం
- నేడు ప్రారంభం

మహారాణిపేట : ఉత్తరాంధ్ర పేదలకు వైద్య సేవలందిస్తున్న కింగ్ జార్జి ఆస్పత్రిలో సౌర (సోలార్) విద్యుత్ పనులు పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టును ఏఆర్ మిట్టల్ సంస్థ సీఎస్ఆర్ కింద రూపొందించింది. బుధవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున దీనిని ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల కేజీహెచ్‌లో విద్యుత్ ఆదా అవుతుందని, ఈ సోలార్ వెలుగులను సీఎస్ఆర్ బ్లాక్‌లో ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. పది శాశ్వత సిమ్మెంటు బెంచీలను కూడా కలెక్టర్ ప్రారంభించనున్నారు. వీటిని ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేశారు. వీటికి లయన్స్ క్లబ్ సహాయం చేసింది.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
✆ 9493185214

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
✆ 9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com